సాక్షి
హైదరాబాద్, మంగళవారం, 12, నవంబర్, 2024

పదేళ్లుగా కాశీలో తెలుగు యాత్రికులకు సేవలు

వారణాసి కశ్యప సేవా సమితి ఎండీ డా. ఫణిభూషన్ దంపతులకు సన్మానం



నల్లకుంట: వారణాసి(కాశీ)లో స్థిర నివాసం ఏర్పరుచుకొని తెలుగు యాత్రికుల కోసం పదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారణాసి కశ్యప సేవా సమితి ఎండీ డాక్టర్ ఎంవీ. ఫణి భూషన్ దంపతులు హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. విషయం తెలుసుకున్న వివేకానంద కేంద్రం కన్యాకుమారి ప్రతినిధులు సోమవారం వారిని వివేకానంద కేంద్రానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ దంపతులను శాలువాతో సన్మానించి వివేకానంద బోధనల పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాటి యాదిరెడ్డి, లింగారెడ్డి, కేంద్రం ప్రతినిధులు రంగా చార్యులు, రామలింగేశ్వర రావు, కేశవ్‌రావు, దేశ్ పాండే, సత్యనారాయణ, విమలా రెడ్డి, వినోద్ రెడ్డి, వివేక్, జనార్దన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రం ప్రతినిధి రామ లింగేశ్వర రావు మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం వారణాసిలో స్థిరపడిన డాక్టర్ ఫణిభూషన్ దంపతులు తెలుగు వారి కోసం పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కాశీ, గయ, నైమిశారణ్య, ప్రయాగ తదితర ప్రాంతాల్లో రవాణ, దర్శనాలు, పితృకర్మలు నిర్వహించాలనుకునే వారికి ఆ సేవా సంస్థ ద్వారా సహకారం అదిస్తున్నారని చెప్పారు. కాశీ యాత్రకు వెళ్లే వారు ఫోన్ నం. 92468 82287లో సంప్రదిస్తే ఫణి భూషన్‌తో మాట్లాడి రవాణ, భోజనం, వసతి తదితర వసతులు ఏర్పాట్లు చేయిస్తామని తెలిపారు.

వైభవంగా ఉజ్జయిని మహాకాల్ కల్యాణం

- ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధ
- కనులపండువగా మూడోరోజు కోటి దీపోత్సవం



కవాడిగూడ: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం సోమవారం మూడో రోజుకు చేరుకుంది. కార్తీక సోమవారం సందర్భంగా తొలిసారి కోటి దీపోత్సవ వేదికపై జ్యోతిర్లింగ క్షేత్రం ఉజ్జయిని మహాకాల్ కల్యాణం కనులపండువగా నిర్వహించారు.

◆ అనంతరం భక్తులకు పల్లకీలో మహాకాల్ సమేత మహాదేవుడి దివ్యదర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా కర్ణాటక హల్దీపూరం మఠం శ్రీ వామనాశ్రమ స్వామి భక్తులకు ఆశీర్వచనం ఇచ్చారు. కర్ణాటక హోస్పేటా చింతామణి మఠం శ్రీశివానంద భారతీస్వామి అనుగ్రహ భాషణం చేశారు. బంగారయ్య శర్మ భక్తులకు ప్రవచనామృంతాలు వినిపించారు. ఈ సందర్భంగా భక్తులచే స్వయంగా శివ పరివారానికి కోటి బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తి టీవీ అధినేత నరేంద్రచౌదరితో పాటు నగర వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోటి దీపోత్సవంలో పాల్గొన్న అశేష భక్త జనవాహిని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధ

మాతృభాష రానివాడు మేధావి కాలేడు

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు సినారె ఆళ్ల స్వర్ణ కంకణం బహూకరణ చేస్తున్న సీహెచ్. విద్యాసాగర్‌రావు, కేవీ రమణాచారి, ఆళ్ల శ్రీనివాసరెడ్డి

చిక్కడపల్లి: తెలుగు భాషకు సినారె వంటి వారితో పాటు నేడు సుద్దాల అశోక్‌తేజ తరం వారు పట్టం కడుతున్నారని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు అన్నారు. మాతృభాష రానివాడు మేధావి కాలేడని ఆయన అన్నారు. త్యాగరాయ గానసభలో ప్రధాన వేదికపై సోవారం రాత్రి వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో సినారె ఆళ్ళ స్వర్ణ కంకణం బహూకరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్‌రావు స్వర్ణ కంకణం ప్రదానం చేసి మాట్లాడారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుద్దాల అశోక్ తేజకు అడవి తల్లి దీవెన ఉందన్నారు. ఆయన రాసిన కొమరం భీమ్ పాట గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సినారె సంస్మరణలో ఓ గ్రంథాలయాన్ని కరీంనగర్ జిల్లాలో ఏర్పాటు చేసే పని జరుగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయినా భాష పరిరక్షణకు ఒకే మడికట్టులో కలవాలని ఆకాంక్షించారు.

◆ డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. చెట్టుపై అశోక్‌తేజ రాసిన 'అమ్మనురా నన్ను కొట్టకురా..'ప్రబోధ గీతంతో మొలక నుంచి మొక్కగా ఎదిగి గీత కర్తగా మహా వృక్షంగా జాతీయ అవార్డు స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఆకలి అన్నం విలువ తెలసిన మనస్సు ఉన్న కవి అశోక్‌తేజ అని ప్రశంసించారు.

◆ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... వికసించిన విరబూసిన పారిజాతం సినారె అని అన్నారు. 'నా రణం మరణం'పై అని ప్రకటించిన ధీర కవి అని కొనియాడారు. శ్రీశ్రీ, వేటూరి తరువాత జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న గొప్పకవి అశోక్ తేజ అని అన్నారు. వేదికపై ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి, బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామచందర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని.. అప్పుడే ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామచందర్ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో తప్పనిసరిగా హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. అయితే కొంతమంది సిగ్నల్స్‌ను జంప్ చేసి పోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. అంతేకాకుండా ఒకే వాహనంపై ముగ్గురు వెళ్తూ అతివేగంతో ప్రయాణిస్తూ వారు ప్రమాదానికి గురికావడంతోపాటు ఇతరులను కూడా ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.విష్ణుప్రియ, కళాశాల ప్రిన్సిపాల్ మట్టా శేఖర్, వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

కార్తీక రెండో సోమవారం భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆకాశదీప పూజ





లక్ష్మీగణపతి దేవాలయంలో పార్వతీ సమేత క్షీరలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు, పూజలో పాల్గొన్న భక్తులు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలతో పాటు ప్రధాన ఆలయాల్లో కార్తీక మాసం రెండో సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి కార్తీక మహాన్యాస పూజలు, కార్తీక మాస ఏక రుద్రాభిషేకం, కార్తీకమాస దీపం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు.

◆ న్యూనల్లకుంటలోని శ్రీసీతారాంజనేయ సరస్వతి ఆలయం(న్యూరామాలయం) ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అర్చక స్వాములు జ్ఞానేశ్వర్, సీతారామ శర్మల మంత్రోచ్ఛరణల నడుమ శివుడికి పెరుగు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి ఇష్టదేవాల మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

◆ శివం రోడ్డులోని లింగాల గడ్డ శివాలయం, తిలక్‌నగర్ శివాలయం, బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లోని బీరప్ప దేవాలయం, శివం మందిరం, టీఆర్టీ కాలనీలోని లక్ష్మీగణపతి శివాలయం, శంకరమఠంలోని చంద్రమౌళీశ్వర ఆలయంలో మహా శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

లక్ష్మీగణపతి దేవస్థానంలో..

చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీగణపతి దేవస్థానంలో కార్తీకమాస రెండో సోమవారం దేవాలయంలో ప్రాంగణంలోని పార్వతి సమేత క్షీరలింగేశ్వరస్వామికి పెరుగుతో అభిషేకం చేశారు. ఏకవార రుద్రాభిషేకం, మహాన్యాస రుద్రాభిషేకం, ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దీపారాధనకు భక్తులకు వత్తులు, ప్రమిదలు, నూనె ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

వివేక్‌నగర్‌లోని స్వయంభూవుగా వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో పవిత్ర కార్తీకమాస ఉత్సవాలలో ఆకాశదీప పూజ, కార్తీక పురాణ ప్రవచనం భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహా మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.దేవనాథం, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, భక్తులు బి.యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్తీక పురాణ ప్రవచనంలో పాల్గొన్న భక్తులు



న్యూ రామాలయంలో శివుడికి హారతి ఇస్తున్న అర్చకస్వామి

చిన్నారులపై వీధి కుక్కల దాడి



అంబర్‌పేట: ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా సమీపంలోని అంబేడ్కర్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా నివాసించే భాస్కర్, దివ్యరాణి దంపతులకు శ్రేయ్(3), త్రిష (2) పిల్లలు ఉన్నారు. ఇద్దరు సాయింత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు వారిపై దాడి చేశాయి. చూట్టుపక్కల వారు గమనించి కుక్కల బారి నుంచి చిన్నారులను రక్షించారు. సమాచారం అందుకున్న తల్లి దండ్రులు చికిత్స నిమిత్తం నారాయణగూడ ఐపీఎం కేంద్రానికి తీసుకెళ్లారు.

కార్తీకమాసంలో దానం ప్రధానం

ప్రముఖ ప్రవచనకర్త డా. అనంతలక్ష్మి



కార్తీకమాస వైశిష్ట్యంపై ప్రవచనం చేస్తున్న డాక్టర్ అనంతలక్ష్మి

చిక్కడపల్లి: కార్తీకమాసంలో దానం ప్రధానమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. గీతా (భగవద్గీత) ఫౌండేషన్, నక్క వెంకటమ్మయాదవ్, నక్కయాదగిరి స్వామి యాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కార్తీకమాస వైశిష్ట్యం అంశంపై ప్రవచన ప్రసంగం నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ ధర్మన్న సాహితీ కళాపీఠం చైర్‌పర్సన్ రాధాకుసుమ నిర్వహణలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి, ప్రముఖులు పాలడుగు సరోజనిదేవి, నక్క శ్రీనివాసయాదవ్, బడేసాబ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్



చిక్కడపల్లి: బీజేపీ ఎలక్షన్ రిక్రూటింగ్ ఆఫీసర్‌గా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బీజేపీ నేతలు సోమవారం ఆయనను అశోక్‌నగర్‌లో కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుస్థిరమైన, సమర్ధవంతమైన పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలబడాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు ఎం. ఉమేష్, జి.శ్రీకాంత్, పి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రోటీ బండా తండాపై దాడులను ఖండిస్తున్నాం

- సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణలోని కొడంగల్ మండలం రోటీ బండా తండాపై ప్రభుత్వం చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ అన్నారు. మూడు వేల ఎకరాల లంబాడీల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనే కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే గిరిజనులపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో సేవాలాల్ సేనా తెలంగాణ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ నాయక్ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళణ పేరుతో ప్రభుత్వం లక్ష 50వేల కోట్లు ఖర్చుచేయనున్నట్లు ప్రకటించిందని, అయితే మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, కానీ.. ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి ఒక్క రూపాయి తీసినా సహించేది లేదని హెచ్చరించారు. సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేస్తే ప్రభుత్వంపై కేసులు పెట్టి కోర్టుకు ఈడుస్తామన్నారు. గిరిజనులకు ఉన్న 10శాతం రిజర్వేషన్లను తొలగించాలనే కుట్ర చేస్తున్నారని, దీన్ని వెంటనే తిప్పికొట్టాన్నారు. జనాభా లెక్కల తర్వాత ఎవరు ఎంత శాతం ఉన్నారో తేల్చకనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్ మహారాజ్, సేవాలాల్ సేనా కన్వీనర్ మాలోత్ సైదానాయక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, కిషన్ నాయక్, స్వరాజ్, హుసేన్, అజయ్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు దేశభక్తి పెంపొందించాలి

- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ
- ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు



డైమండ్ జూబ్లీ ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: విద్యార్థులకు చదువుతో పాటు దేశభక్తి, మన భారత సంస్కృతి, సంప్రదాయాలపై శిక్షణ ఇస్తున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రారంభమై 75 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ 75ఏళ్లలో వేలాది మంది విద్యార్థులకు నైపుణ్యతను జోడించి దేశానికి అందించిన ఘనత భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌దేనని అన్నారు. సోమవారం గగన్‌మహల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో డైమండ్ జూబ్లీ ముగింపు ఉత్సవాలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలుగా సంస్థలో సేవలు అందించిన వారికి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, మోమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా తయారవుతారని పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో చేరితే క్రమశిక్షణ అలవడుతుంది. ఈ కార్యక్రమంలో చీఫ్ కమిషనర్ బుర్రా వెంకటేశం, గవర్నర్ జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ఎం. రాజగోపాల్, సి.జె అరుణ్ కుమార్, బి.పరమేశ్వర్, జాన్ సామ్యూల్, లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, ముషీరాబాద్ మీడియా సెల్‌ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు వల్లాల శ్యామ్‌యాదవ్, తరికే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు.

◆ ప్రివెంటీవ్ మెడిసన్ ఫీడర్ పరిధిలో గౌరమ్మ గల్లీ, రాజీవ్‌గాంధీ నగర్ కమ్యూనిటీహాల్, సాయిబాబా కమాన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దుర్గామెస్, రెడ్డి కాలేజ్, హెచ్ఆర్‌డీ కాలేజ్, రత్న డిగ్రీ కాలేజ్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు.

◆ డీడీహెచ్ ఫీడర్ పరిధిలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఆసుపత్రి, విజ్ఞాన్‌పురి కాలనీ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, వీఎస్‌టీ మెయిన్ రోడ్, దయానంద్‌నగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సుందరయ్యపార్కును సందర్శించిన ఎమ్మెల్యే

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కును ఎమ్మెల్యే ముఠాగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కును సందర్శించి అభివృద్ధి పనులను సమీక్షించారు. పార్కులో ఇటీవల నిర్మించిన టాయిలెట్ల అసంపూర్తి పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే ఎలా? ఇప్పటికైనా పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఏఈకి ఫోన్ చేసి సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు వివేక్, ఉపాధ్యక్షులు బబ్లూ, రాజు, మాజీ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే..

ముషీరాబాద్: సమగ్ర కుటుంబ సర్వే సోమవారం ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తి కావడంతో కుటుంబ వివరాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు పేజీలు ఉన్న సర్వే బుక్‌లో వివరాలు నమోదు చేసేందుకు అరగంట నుంచి 40 నిమిషాల సమయం పడుతోందని ఎన్యుమరేటర్లు పేర్కొంటున్నారు. సర్వే బుక్‌లు సోమవారమే ఇచ్చారని తెలిపారు. 56 ప్రశ్నలు వాటికి ఏ, బీ, సీ ఆప్షన్‌లు ఇచ్చారని, వాటిని నమోదు చేసేందుకు సమగ్రంగా కుటుంబ వివరాలు సేకరించడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు.

వయనాడ్ ఎంపీ ఎన్నికల బరిలో నగరవాసి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రావు

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళ రాష్ట్రం వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో హైదరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన జాతీయ జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వర్‌రావు పోటీ చేస్తున్నారు. రాహుల్‌గాంధీ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంక గాంధీ ఇక్కడ కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న విషయం తెలిసిందే. త్వరలో ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటారని డాక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. వయనాడ్‌లో పోటీ చేస్తున్న 16 మంది అభ్యర్థుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్.రాజన్ తప్ప మిగతా వారంతా స్థానికేతరులు కావడం విశేషం.

ప్రజలు చైతన్యవంతులు కావాలి

ప్రొఫెసర్ ఆరుట్ల జానకీరెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామాన్య ప్రజలు తెలివిమీరితే కొందరి సీట్లు కూలిపోతాయని ఆ దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాలని ప్రొఫెసర్ ఆరుట్ల జానకీరెడ్డి అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ తెలంగాణ, ఏపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల ప్రజలు చైతన్యవంతులై మన ఓట్లు మనమే వేసుకోవాలని, అప్పుడే రాజ్యాంగ ఫలాలు సామాన్య ప్రజలకు అందుతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్లూట్ల ఉపేందర్ మాట్లాడుతూ... భారత విప్లవోద్యమంలో చంద్రపుల్లారెడ్డి చూపిన మార్గం గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయూఎస్ఐ నాయకులు నర్సయ్య, సీయూసీ కో-కన్వీనర్ అబ్దుల్ కరీం, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు మల్లేష్, రైతు కూలి సంఘం నాయకులు మల్లేష్, పీడీఎస్‌యూ నేత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేక ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బాలరాజు (43) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం... శివరాంపల్లి - ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య బి.మహేందర్ (43) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.